## అమ్మో... టీచర్!

శర్వాణీ మిస్‌ని అర్జంటుగా రమ్మని కేకేశాడు ప్రిన్సిపాల్.


ప్రిన్సిపాల్ రూమ్ గుమ్మంలోకి ఆమె చిరాకుగా వెళ్లింది.

"ఏమ్మా! గాజులు చేత్తో పిల్లకాయల్ని వీపులమీద బాదేస్తావంటగా! నీ గాజులు బంగారం గానూ! అందుకే రమ్మన్నా...నిన్న నవనీతం అనే స్టూడెంట్‌ని చాలా రేవు పెట్టేవంటగా! నీ గాజులు చిట్లి ఆ పిల్ల వీపు మీద గ్రుచ్చుకున్నాయంట! ఆ కుర్రది నిన్న ఇంటర్‌వెల్‌లో పారిపోయింది. పోనీ అదైనా నీకు తెలుసా? శాడిజం అంటారు ఇలా చేస్తే! తెల్సా?" అంటూ వడగండ్ల వాన కురిపించేశాడు. శర్వాణికి వొళ్లు మండిపోయింది.

"బంగారం గాజులు మాకెక్కడొస్తాయి సార్? ఆ పిల్ల నవనీతం చదివేది ఆరో క్లాసే...గానీ దాని వొళ్లంతా పొగరే సార్" ముక్కుపుటాలు ఎగరేసింది.

నవ్వాడు కరస్పాండెంట్ కమ్ ప్రిన్సిపాల్ కమ్ స్కూలు యజమాని "అందుకని దాని అంతు చూస్తానన్నావు నువ్వు? అవేం పనులమ్మా? తల్లిదండ్రులు వాళ్ళ కష్టార్జితాల్లో నాలుగో వంతు నెల నెలా మన ఎదన కొట్టి పిల్లకాయలకి నాలుగు ఇంగ్లీషు ముక్కలు వస్తే గొప్పగా ఉంటుందనీ పంపిస్తున్నారు! అబ్బెబ్బే..ఎమ్మెస్సీ ఫస్ట్ క్లాసంటావ్...పిల్లల సైకాలజీ తెలవకపోతే ఎట్టమ్మా? నో..నో..మా స్కూల్లో కొట్టకుండా లెసన్స్ చెప్పాలి! బీ కేర్ ఫుల్ హియర్ ఆఫ్టర్! ఆర్..రిజైన్..యూకెన్ గో" అన్నాడు.

శర్వాణి బుసలు కక్కుతూ వెళ్ళిపోయింది. నిజానికి శర్వాణికి చేతి దురుసుతనం ఎక్కువ. అసలామె హయ్యర్ క్లాసులకి కెమిస్ట్రీ చెప్తానంటూ ఇంటర్వ్యూకి వచ్చింది. వంటింట్లో బుట్టలో ఉంటుందే ఉప్పు దాన్ని కెమిస్ట్రీలో ఏంటంటారు? సోపుల పెట్టెలో ఉంటుందే- తినే సోడా దాని పేరేంటి? ఫార్ములా ఏంటి? బట్టలకి నీలిమందు పెడితే అవి తెల్లగా ఎందుకవుతాయి? లాంటి జి.కె. ప్రశ్న లేసి అన్‌ఫిట్ చేసేశారు కమిటీ మెంబర్లు. ఆరో క్లాసులో ఖాళీ ఉంది...అని- ఇక్కడ వేశారు. కానీ తక్కువ అనుభవం వున్న యువతి కాదామె. ఆరో స్కూలు యిది.




పాత స్కూలు..ఒకదానిలో పిల్లలు అల్లరి చేసినప్పుడల్లా 'బాద' మని దెబ్బకి దెయ్యం ఝడుస్తుంది అన్నట్టు- తన్నులు పడితే తప్ప పిల్లల్లో డిసిప్లిన్ ఉండదని వో పెద్ద రూళ్ళ కర్ర సప్లయి చేశాడు అక్కడి హెడ్ మాస్టర్. ఆ స్కూల్లో ఒకరోజు క్లాసంతా గోల చేస్తున్నారు. ఐదో క్లాసు పిల్లలంతా. ఉండుండి చెలరేగిపోయి అల్లరి చేస్తారు.

'సైలెన్సు...సైలెన్సు...నోటిమీద వేలేసుకోండి' అని అరుస్తూ శర్వాణి ఓ వైపు పిల్లల్ని అదుపుచేస్తూ ఉంటే రెండోవైపు అల్లరి ఎక్కువవుతోంది. అంతలో హెచ్.ఎమ్. అటు వచ్చాడు. ఈ దృశ్యం చూసి వీరావేశం ఎత్తిపోయాడు. ఆమె చేతి బెత్తం లాక్కుని దాంతో పిల్లల్ని ఎక్కడి వాళ్ళనక్కడే బాదేశాడు. నీలి అంచు తొడిమలతో తెల్లని పువ్వుల మొక్కల్లా వున్న పిల్లలున్న ఆ క్లాసు అంతా గ్రుడ్డెద్దు చేలో పడి క్రుమ్మినట్లు అయిపోయింది. హాహాకారాలెత్తిపోయారు పిల్లలు.

'స్పేర్ ది రాడ్ అండ్ స్పాయిల్ ది చైల్డ్ అని గోడలమీద రాయించాను చూడలేదా?' అంటూ శర్వాణిని కొరకొరా చూస్తూ వెళ్ళిపోయాడు హెచ్.ఎమ్.

ఆ మరుసటి రోజు శర్వాణి పెరుమాళ్ చెట్టియార్ అండ్ పిక్స్‌టీన్ దోసేస్ అన్న ఇంగ్లీషు పాఠం చెబుతోంది. పాఠంలో పెరుమాళ్ చెట్టి స్నేహితులతో పందెం కాసి పదహారు దోసెలే ఏకబిగిన తినేస్తాడు. ఈ పాఠం విని గిరీష్ అన్న కుర్రాడు లేచి 'ఐ వాంట్ ఫోర్ దోసెస్ మిస్' అన్నాడు.

ఈ మాటలు అట్నుంచి వెళ్తున్న హెచ్.ఎమ్. ఇటు వచ్చి విన్నాడు. అగ్గి రుద్రుడైపోయాడు. క్లాసులోకి వచ్చి "ఏంరా నీకు ఫోర్ దోసెలు కావాలా? ఇదేం పుల్లట్లపాక అనుకున్నావురా రాస్కెల్..డజన్ ఇడ్లీ తెప్పిస్తా! తింటావురా?" అంటూ గద్దించాడు.

వాడు ఉత్సాహంగా "తింటాను సార్! బెట్" అన్నాడు. హెచ్.ఎమ్.కి వెర్రెత్తింది. ఆయాని పిలిచి "ఇడ్లీలో పది తేవే సూరమ్మా" అన్నాడు.

"తినరా! తినకపోతే చంపుతానన్నాడు"

గిరీష్‌కి నాలుగు ఇడ్లీలు తినేసరికి స్పీడు తగ్గింది. వెక్కిళ్ళు మొదలైనాయి. శర్వాణి మంచినీళ్ళు ఇవ్వబోయింది. "స్టాపిట్! పది ఇడ్లీ తింటేనే వీడివాళ ఇంటికి పోతాడు! పదీ తినిపిస్తేనే నువ్వు రేపు స్కూలుకి వస్తావు. టేక్కేర్" అంటూ వెళ్ళిపోయాడు. కాస్సేపటికి మళ్లీ వచ్చి గిరీష్ చేత ఇడ్లీ నోట క్రుక్కి మరీ తినిపించమని శర్వాణి మీద ఒత్తిడి తెచ్చాడు. చీటికీ మాటికీ పిల్లల్ని కొట్టే శర్వాణి కూడా కన్నీళ్ళ పర్యంతం అయ్యింది.

ఆ పిల్లవాడు కొంతసేపటికి సొమ్మసిల్లి పడిపోయాడు. 'వీణ్ణి రిక్షాలో వేసి వాళ్ళింటి దగ్గర వదిలెయ్య'మన్నాడు హెచ్.ఎమ్-

గిరీష్ తల్లిదండ్రులు అంత చదువుకున్నవాళ్ళు కారు. ఇంటికి దగ్గరలో ఉంది కొత్త ఇంగ్లీషు స్కూలు కదాని పిల్లవాణ్ణి అందులో వేశారు. అలాగే ఆ చుట్టుపట్ల వాళ్ళంతా స్కూలు నింపేశారు. అసలా హెచ్.ఎమ్. ఎటువంటివాడో వాళ్ళకి తెలియదు.

గిరీష్‌ని తల్లిదండ్రులు ప్రక్కనే వున్న డాక్టర్ దగ్గరికి తీసుకుపోయారు.

'ఫుడ్ పాయిజనింగ్' అయిందని చెప్పాడు డాక్టర్. గిరీష్ ఫ్రెండ్ వచ్చి ఆవేశంగా స్కూల్లో టీచర్ ఇడ్లీలు కుక్కి కుక్కి తినిపించిందని చెప్పేరు. ఇరుగూ పొరుగూ వున్న కార్మికులు, కష్టజీవులు అంతా కలిసి ఆవేశంగా హెచ్.ఎమ్. ఇంటి మీదకి దాడి చేశారు.

పరిస్థితి చెయ్యిదాటిందని గ్రహించిన హెడ్‌మాస్టర్ ఫణీందర్‌రావు "సారీ..సారీ బ్రదర్స్! అదుగో ఆ టీచర

మ్మాయే ఉత్త శాడిస్టు. రోజూ ఏదో విధంగా ఇట్లా పిల్లల్ని కాల్చుకుతింటోంది! ఆమెదే యీ నిర్వాకం! నేను తక్షణం ఆ టీచర్‌ని తీసేస్తాన్లెండి..ఇదుగో ఈ వంద రూపాయలు తీసుకుపోయి గిరీష్‌బాబుకి ట్రీట్‌మెంట్ ఇప్పించండి...అసలే వాడు బక్కపీచు" అంటూ వాళ్ళని శాంతబరచి మెత్తబరిచి పంపేశాడు. తాను తప్పించుకున్నాడు.

మర్నాడు ఉదయం శర్వాణి స్కూలుకు బయలుదేరుతూ ఉండగా ఆయా ఇంటికే వచ్చింది. "సారుగారు మిమ్మల్ని స్కూలుకి రావద్దన్నారు. రావాల్సిన జీతం డబ్బులు నెలాఖరున కనబడి పట్టుకుపొమ్మన్నారు. మీరొస్తే జనాలు చంపేస్తారంట" అని చెప్పి వెళ్ళిపోయింది.

శర్వాణి గుండె గాయమయింది.

అక్కణ్నుంచి వచ్చేసిన కొన్నాళ్ళకి యీ స్కూలులో చేరితే- 'శాడిస్టు' అన్నాడీ స్కూలు యజమాని. బెత్తంతో కొడితే గాయం అవుతుందని చేత్తో కొడుతుందీమధ్య! ఆమెకి ఏమీ తోచలేదు.

ఆ సాయంకాలం నవనీతం అనే పాప వాళ్ళ ఇంటికి ధైర్యం చేసి వెళ్ళింది 'సారీ' చెప్పింది శర్వాణి.

ఆ పిల్ల శర్వాణిని చూస్తూనే 'మిస్ వచ్చారు మిస్ వచ్చారు' అంటూ దెబ్బలు మరిచిపోయి నిర్మలంగా నవ్వేసింది.

ఆ పిల్ల పేరెంట్స్ అన్నారు 'గుండె మరీ అంత పుండు చేసుకోబాకమ్మా! పిల్లల్ని ఒక్కోసారి ఆవేశంలో మేం కూడా ఓ దెబ్బ వేస్తాం. ఇదీ అట్లాంటిదే' నంటూ 'చిన్న గాయమైనా మానిపోతుందిలే' అంటూ కాఫీ ఇచ్చి త్రాగమని బలవంతం చేశారు.

శర్వాణి గుండె గాయానికి ఉపశమనం కలిగింది. కొత్తగా చేరిన స్కూల్లో గాజులు తీసి బ్యాగులో వేసుకోవడం అలవాటు చేసుకుంది. శర్వాణి పిల్లల్ని కొట్టకుండా పాఠాలు చెప్పాలని శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తోంది. అది సాధ్యమా?

-వీరాజీ

ooo

"గిరీ..వేడి వేడి దోశె తెచ్చి పెట్టవూ" గోముగా అడిగింది జూనియర్ అసిస్టెంట్ లత. ఆమె అలా అడిగినప్పుడల్లా యాదగిరి గుండె కొలతలు అమాంతం పెరిగిపోయి ఒళ్ళంతా కరెంటు పాకినంత షాకు!

తనంటే లత మేడంకు ఎంతో ఇది అని యాదగిరి అమాయక గుండెలో ఒకటే రొద. క్షణంలో రోడ్డుకవతల ఉన్న టిఫిన్ సెంటర్ నుంచి దోశె తీసుకొచ్చి ఇచ్చాడు.

"థాంక్స్" చిలిపిగా నవ్వుతూ చూసింది.

"కాఫీ తేనా మేడం?" అన్నాడు.

కొలీగ్ మాలతి లత వంక ఓరకంట చూసింది.

కుర్రాడ్ని బుట్టలో వేసుకొని అన్నీ కూర్చున్న చోటికే తెప్పించుకుంటుంది. యాదగిరి కాఫీ తెచ్చాడు. లత డబ్బు లివ్వబోతే తీసుకోలేదు. మొహం తిప్పుకున్నాడు.

"గిరీ..కోపం వచ్చిందా?" తేనెలొలికిస్తూ అడిగింది లత.

గిరి మాట్లాడలేదు. అటువైపే చూడలేదు.


"అరెరె సారీ గిరీ...తీసుకోవద్దులే" తీసిన డబ్బును బ్యాగ్‌లో పెట్టేసింది.

ఆమె ఆఫీస్ అసిస్టెంట్..నువ్వు అటెండర్‌వి. ఆమె వయసులో నీకంటే పెద్దది...అని అప్పుడప్పుడు యాదగిరిలోని వివేకం ఎదురు తిరుగుతుంది. ఫలాని క్రికెటర్ తన కంటే పెద్దామెను చేసుకోలేదా?..మనసు వివేకం మీద విరుచుకు పడుతుంది.

ఒకరోజు లతకి బస్ దొరకలేదు. ఆఫీస్‌కు ఆలస్యం అవుతున్నది. చూసి చూసి "ఆటోలో వెళ్తారా మేడం" అని అడిగాడు.

"అబ్బో..ఎంతవుద్దో"

"ఫ్రెండ్ ఆటో ఉంది" అని పరుగెత్తాడు యాదగిరి.




తన ఫ్రెండ్‌కు మేడం దగ్గర డబ్బులు తీసుకోవద్దని చెప్పాడు. లత ఆఫీస్‌కు సమయానికి హాయిగా చేరుకున్నది. గిరి మాత్రం రష్ బాగా ఉన్న బస్‌లో ఒళ్లు హూనమై ఆలస్యంగా ఆఫీస్‌కు చేరుకున్నాడు.

గిరికి ఓ ఆలోచన మనసులో మెదిలింది. తాను ఒక టూ వీలర్ ఎందుకు కొనకూడదు? అవసరం అయినప్పుడు లతను వెనక సీట్లో కూర్చోబెట్టుకొని...

బ్యాంక్‌లో అడిగితే యాదగిరికి వచ్చే జీతానికి అంత అప్పు ఇవ్వనన్నారు. ఫైనాన్స్ వాళ్ళను అడిగితే- ఇరవై శాతం డబ్బు కట్టాలన్నారు. ఎట్లా జమ చేయడమా అని ఆలోచిస్తున్న యాదగిరికి తాను తల్లి కంటి ఆపరేషన్ కోసం దాస్తున్న డబ్బులు గుర్తుకొచ్చాయి.

అంతే! బండి కొనేసాడు.

ఆ బండిని చూసి.."వావ్..చాలా బాగుంది గిరి ఎప్పుడు కొన్నావ్?" లత తన వంక ప్రశంసగా చూసి నవ్వుతున్నట్టు...తన వెనక బండి మీద కూర్చొని భుజం మీద చేయి వేసినట్టు...ఊహల్లో తేలిపోతున్నాడు.

హుషారుగా ఈలవేసుకుంటూ వస్తున్న యాదగిరికి ఒకరోజు లంచ్ సమయంలో లత, మాలతి మాట్లాడుకుంటున్న మాటలు వినిపించాయి.

"గిరిని బాగా ఆటపట్టిస్తున్నావే..వాడంటే నీకు వల్లమాలిన ఇష్టం అనుకుంటున్నాడు" అంది మాలతి.

"ఆఫ్టరాల్ వాడొక అటెండర్..వాడిని ఇష్టపడటం ఏవిటి?..ఏదో సరదాగా మాట్లాడ్తాను. అది నా నేచర్..అంతే!" తేలికగా తీసిపడేసింది లత.

"నీ ప్రవర్తన అమాయకుడైన గిరిని లేనిపోని ఊహలకు గురి చేస్తున్నదని అనిపిస్తున్నది. ఆ ఊహలు తలకిందులని తెలిస్తే వాడే వెర్రైపోతాడో పాపం! నువ్వేమైనా అను లతా...నువ్వు చేస్తున్నది తప్పు. వాడికి లేనిపోని ఆశలు కల్పించడం మంచిది కాదు"

"ఇందులో నా తప్పేముంది చెప్పు? నేనేం ఆశలు కల్పించాను. టిఫిన్, కాఫీలు తెమ్మనడం తప్పా? డబ్బులిస్తే వాడేం తీసుకోడు. ఒకే చోట ఉంటాం కనుక బస్‌లు దొరకనప్పుడు ఈమధ్యే బండిమీద దిగబెడుతున్నాడు. ఇందులో ఆశలేం ఉన్నాయి? ఊహలేం ఉన్నాయి? ఏదో సరదాగా పనులు చేస్తాడు. అంతే. కావాలంటే నువ్వూ చేయించుకో"

ఆ మాటలు విన్న యాదగిరికి గుండెలో గునపాలు గుచ్చినట్లయింది. ఆ మాటలు తట్టుకోలేకపోయాడు. గిరుక్కున వెనుతిరిగి బండి ఎట్లా స్టార్ట్ చేశాడో తెలియదు. ఎక్కడెక్కడ పిచ్చి వాడిలా తిరిగాడో తెలియదు. అర్ధరాత్రి దాటాక గది చేరుకున్నాడు. లైటు వేయగానే టేబుల్ మీద ఆఫీస్ స్టాఫ్ గ్రూప్ ఫోటో కనిపించింది. అందులో లత ఉన్న భాగాన్ని చింపి ముక్కలు ముక్కలు చేశాడు!

-డా.సదానంద్ శారద (సికింద్రాబాద్)